క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

రాజాం: వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధులను జమ చేసిన నేపథ్యంలో మండలంలోని అంతకాపల్లిలో స్వయం సహాయక సంఘాల మహిళలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేసి, ధన్యవాదాలు తెలిపారు. థాంక్యూ సీఎం సార్.. జై జగనన్న నినాదాలు చేసి, అభిమానం చాటుకున్నారు. రానున్న ఎన్నికల్లోనూ తామంతా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు ఎస్.అరుణకుమారి, వైస్ ఎంపీపీ ఎన్.వర్షిణి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానబోధ సభ

రేగిడి: స్థానిక దత్త పీఠంలో ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వక్త కిమిడి సత్యంనాయుడు మాట్లాడుతూ భగవంతుని నామస్మరణతోనే మోక్షం లభిస్తుందన్నారు. ప్రజలంతా ఆధ్యాత్మిక బాట పట్టి, ఇష్టదైవాన్ని రోజూ మొక్కుకోవాలన్నారు. కార్యక్రమంలో దత్త పీఠం కన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రుచి, శుచి కలిగిన భోజనం పెట్టాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అందిస్తున్న మధ్యాహ్నం భోజనం రుచి, శుచి కలిగి ఉండాలని ఎంఈవో–2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని ఆమదాలవలస కాలనీ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి భోజనం అందివ్వాలన్నారు. మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలన్నారు.

రిపోర్టులు సమర్పించాలి

బొబ్బిలి: రిపోర్టులు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులతో శుక్రవారం సమావేశమైన ఆమె ప్రభుత్వ ప్రాధాన్య రిపోర్టులు వెంటనే ఇవ్వాలని తెలిపారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్‌ను ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల అసహనం



మండల సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ పీవో, రోడ్లు, భవనాల శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ ఏడీ సమావేశానికి హాజరుకాకపోవడంతో సదరు అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. ప్రధానంగా సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఫేజ్–1 నాడు–నేడు పనులపై రోడ్లు, భవనాల శాఖ అధికారులను జెడ్పీ వైస్ చైర్మన్ ఫోన్‌లో సంప్రదించి, వివరణ కోరారు. పశువర్ధకశాఖ ఏడీ ఎప్పుడైనా ఆస్పత్రులను సందర్శించారా అని వాల్తేరు, జి.ఎస్.పురం, మండాకురిటి పశు వైద్యశాలల వైద్యులను అడగ్గా.. వారు లేదని సమాధానమిచ్చారు. దీంతో సభ్యులంతా మండల తీర్మానం చేసి అతడిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్‌ను కోరారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఏవో నవీన్ మాట్లాడుతూ 27,932 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.మంజు, వైస్ ఎంపీపీ పి.పాపారావు, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



రాజాం: వీఆర్ అగ్రహారంలో పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



సంతకవిటి: తలతంపరలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ నవీన్

వాడవాడలా సామాజిక పింఛన్ల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. శుక్రవారం వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి, బయోమెట్రిక్, ఐరిష్ ఆధారంగా పింఛన్ నగదు అందజేశారు. మరికొన్ని చోట్ల సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నేతలు కూడా పింఛన్లు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ హయాంలో ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము అందుతుండడంతో లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్.

అక్కచెల్లెమ్మలకు ఆర్థికభరోసా

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం:

రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని, వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారికి ఆర్థికభరోసా కల్పిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధుల చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగనన్న ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని, ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 ఏప్రిల్ నాటికి బకాయిపడిన వారి రుణాల వడ్డీలను నాలుగు విడతల్లో మాఫీ చేశారని తెలిపారు. ఈ వడ్డీ నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడమనేది సీఎం జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారన్న దానికి నిదర్శమన్నారు. గతంలో టీడీపీ ఇదే హామీని ఇచ్చి, మహిళలను మోసం చేసిందని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలు లేనిపోని మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, వారి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రాజకీయాల్లో మాట తప్పని, మడమతిప్పని నేతగా దేశంలోనే మంచి ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరొందారన్నారు. 2024 ఎన్నికల్లోనూ ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే అన్నివర్గాల ప్రజలు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. వైఎస్సార్ సీపీకి కంచుకోటగా పేరొందిన రాజాం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కంబాల జోగులును రెండుసార్లు గెలిపించారని, అదేమాదిరి ఇప్పుడు డాక్టర్ తలే రాజేష్‌ను కూడా ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఇటీవల వచ్చిన సర్వేల్లో వైఎస్సార్ సీపీ గెలిచే స్థానాల్లో రాజాం ఉందని, ఇది మనకు, మన పార్టీకి శుభసూచకమన్నారు.

టీడీపీని నమ్మొద్దు..

టీడీపీని నమ్మొద్దని, ఆ పార్టీని గతంలో నమ్మి మోసపోయిన సంగతి మర్చిపోకూడదని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే వైఎస్సార్ సీపీని తప్పనిసరిగా అధికారంలో ఉంచాలన్నారు. అన్నివర్గాల మహిళల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గుర్తుంచుకోవాలన్నారు.

రూ.53.23 కోట్ల లబ్ధి..

వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ రాజాం పట్టణంతో పాటు మండలంలోని 1801 స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత కింద రూ.13.58 కోట్లు అందిందని, మొత్తం రూ.53.23 కోట్లు అందిందన్నారు. డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తుండడంతో ఏ ఒక్క ప్రభుత్వ పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇక్కడ తనను, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ బి.సుధాకర్, ఏసీ చిరంజీవి, ఎంపీపీ ఎల్.సులోచన, జెడ్పీటీసీ బి.నర్సింహులు, పార్టీ టౌన్, రూరల్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడులు, వైస్ ఎంపీపీలు ఎస్.వర్షిణి, వై.వెంకటేష్, సర్పంచ్ వి.చిన్నంనాయుడు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ఎంపీడీవో బి.శంకరరావు పాల్గొన్నారు.



రాజాం: వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎంపీ బెల్లాన, తలే రాజేష్ తదితరులు

ఇంటి అవసరాలు తీరాయి..



నాకు వైఎస్సార్ ఆసరా పథకం నగదు ఎంతగానో ఉపయోగపడుతోంది. నాలుగు విడతలుగా వచ్చిన డబ్బులో కొంత డబ్బులతో ఇంటి అవసరాలు తీరాయి. మరి కొంత డబ్బులతో ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని, ఆదాయం సమకూర్చుకుంటున్నాను.

– ఎ.కమలమ్మ, అంతకాపల్లి, రాజాం మండలం.

ఆర్థిక ఇబ్బందులు తొలగాయి..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. చిన్నచిన్న అప్పులు తీర్చుకుని, ఆనందంగా ఉన్నాం. వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకుంటాం.

– డి.విజయలక్ష్మి, సారథి, రాజాం పట్టణం.

మహిళాభ్యున్నతికి పెద్దపీట..



మహిళలకు సీఎం జగన్ చేసిన మేలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కైలాం గ్రామంలో వైఎస్సార్ ఆసరా నిధుల చెక్కుల పంపిణీ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. ఇప్పటి వరకు 99 శాతం హామీలు అమలు చేసి, అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా చేశారన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షిస్తున్నారని, ఆ దిశగా అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తూ మహిళా పక్షపాతిగా ఆయన పేరుతెచ్చుకున్నారన్నారు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది అక్కచెల్లెమ్మలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.56 కోట్లు అందించిన ఏకైక ముఖ్యమంత్రి మన సీఎం జగనన్న అని ప్రశంసించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, 14 లక్షల మంది ఈ ఐదేళ్లలో స్వయం ఉపాధి మార్గం పట్టి, ఎవరిపైనా ఆధారపడకుండా చక్కగా జీవిస్తున్నారన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. వీటిని వినియోగించుకుని, ఎంతోమంది మహిళలు ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతుకుతున్నారన్నారు. మండలంలోని 785 డ్వాక్రా సంఘాలకు సంబంధించి, 8,583 మంది అక్కచెల్లెమ్మల రూ.16 కోట్ల రుణాన్ని సీఎం జగనన్న మాఫీ చేశారన్నారు. దీంతో ఎంతోమంది మహిళలు అప్పుల ఊబి నుంచి బయటపడి, జగనన్న గొప్పతనం చెప్పుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధించవచ్చన్నారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఎంపీపీ ఆర్.సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్.ఈశ్వరరావు, పి.దుర్గ, ఎంపీటీసీ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థిక స్వావలంబన



రామభద్రపురం: వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి తదితరులు

రామభద్రపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికస్వావలంబన సాధిస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మండలంలోని 990 మహిళా సంఘాల్లోని 1059 మంది సభ్యులకు సంబంధించి, రూ.5,02,54,639 చెక్కును అందజేశారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ మహిళలంతా ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

టీడీపీకి ఓటేస్తే రాష్ట్రం అధోగతిపాలు..

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ ఓటేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఎన్నికలు సమీస్తుండడంతో టీడీపీ నేతలు కాకమ్మ కబుర్లు, అబద్ధపు హామీలు చెప్పుకుని ఇంటింటికీ వస్తారని అక్కచెల్లెమ్మలు వాటిని నమ్మవద్దని హితవుపలికారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదో నిలదీయాలన్నారు. రాష్ట్రంలో రూ.25 వేల కోట్ల డ్వాక్రా రుణాలను జగనన్న మాఫీ చేశారని తెలిపారు. ఆసరా డబ్బులతో మహిళలు స్వశక్తితో ఎదగాలని ఆకాంక్షించారు. ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

సామాన్యులకు, రాజులకు యుద్ధం..

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ టీడీపీకి అమ్ముడు పోయి, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేసిన రాజులను ఎప్పటికీ నమ్మవద్దన్నారు. మంత్రి పదవుల కోసం అమ్ముడుపోయిన వారు కనీసం నియోజకవర్గం అభివృద్ధి కోసం ఆలోచించలేదని విమర్శించారు. బొబ్బిలిలో సామాన్యులకు రాజులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రజలంతా సామాన్య వర్గాన్ని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలు అందిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, రాష్ట్ర ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, వైస్ ఎంపీపీలు బి.ప్రసాద్, పి.శేఖర్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, తహసీల్దార్ సులోచరాణి పాల్గొన్నారు.

ఓటేసి రుణం తీర్చుకుంటాం..



వైఎస్సార్ ఆసరా పథకంతో మాలాంటి వాళ్లకు ఎంతోమేలు జరిగింది. గత ఎన్నికల సమయానికి మా గ్రూపు సభ్యులకు బ్యాంకులో అధిక సంఖ్యలో అప్పు ఉండేది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో పూర్తిగా రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం మా అప్పు తీర్చడంతో ఆర్థికంగా భరోసా కలిగింది. రానున్న ఎన్నికల్లోనూ తామంతా సీఎం జగనన్నకు అండగా ఉండి, ఓటేసి ఆయన రుణం తీర్చుకుంటాం.

– పువ్వల సత్యవతి, డ్వాక్రా గ్రూపు సభ్యురాలు, రొంపల్లి.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్

రాజాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఒకేచోట కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనంతో పాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా వీటిని ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాసంక్షేమానికి అనేక ప్రభుత్వ పథకాలు, ప్రతీ గ్రామం అభివృద్ధి చెందేలా పనులు కల్పిస్తున్నారన్నారు. ఆ తర్వాత ఆయా భవనాలను చేరుకోవడానికి వీలుగా సీసీ రోడ్డు సౌకర్యం కల్పించిన సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడును అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసనమండలి విప్ పి.విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ రాజాం టౌన్, రూరల్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, ఎంపీటీసీ బి.కాంతారావు, ఎంపీడీవో బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గ్రామగ్రామాన ఏర్పాటైన వైద్యశిబిరాల్లో ఆరోగ్య తనిఖీలు చేయించుకునేందుకు ప్రజలు ఉత్సాహం కనబరుస్తున్నారు. శుక్రవారం శిబిరాలకు వచ్చిన వారికి వైద్యారోగ్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సకు పలువురిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. ఊరూరా అందుబాటులోని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను కోరుతున్నారు. ఉన్న ఊరిలోనే ఉచితంగా వైద్యం అందుతుండడంతో ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్.



బాడంగి: గూడెపువలసలో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



రేగిడి: కందిశలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది



రాజాం: పొగిరిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు

ఆర్‌బీకేలతో రైతులకు మేలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఆర్‌బీకే భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో అందుబాటులోకి తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)తో రైతులకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆర్‌బీకే భవనం, సీసీ రోడ్డును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతులకు పెట్టుబడి సాయం దగ్గర నుంచి విత్తనాలు, ఎరువుల సరఫరా, సాగు సలహాలు, సూచనలు ఇవ్వడం, పంట విక్రయానికి అవకాశం కల్పించడం, పంట నష్టపరిహారం ఇవ్వడం జరుగుతోందన్నారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా అన్నదాతలకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుతున్నాయన్నారు. గతంలో ఇవే విత్తనాలు, ఎరువుల కోసం రైతులు మండల కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న తపన అని, ఆయన ఆ దిశగా అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు అండగా ఉండి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, ఎంపీడీవో పి.రవికుమార్, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, సర్పంచ్ జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని తునివాడ గ్రామంలో ఓ దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న 30 మద్యంసీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సంబంధిత వ్యాపారిపై కేసు నమోదు చేశామన్నారు.

వంగర: మండలంలోని కె.కొత్తవలస జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 13 మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని, తంగుడు రామ్మోహనరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నందుకు గాను ఎమ్మెల్యే శంబంగి సోదరులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బొబ్బిలి: గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, వలంటీర్‌ల ద్వారా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నందుకు గాను సర్పంచ్ బొద్దల పద్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను, ఆయన సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడును గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, సర్పంచ్ బి.పద్మాసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తెర్లాం: ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మధుసూదనరావుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

బాడంగి: మండల తహసీల్దార్‌గా ఎస్.రాజారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామభద్రాపురం మండల తహసీల్దార్‌గా నియమితులై, శ్రీకాకుళం జిల్లాలోని సంతకవిటి మండలానికి డెప్యుటేషన్‌పై వెళ్లి, మళ్లీ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అజురఫీజాన్ అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు.

తెర్లాం: ఎంపీడీవోగా మధుసూదనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శంబంగి రామకృష్ణ సంతకవిటి మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో ఎంపీడీవోగా పనిచేసిన మధుసూదనరావు ఇక్కడకు వచ్చారు.

తెర్లాం: మండల తహసీల్దార్‌గా డి.దిలీప్‌చక్రవర్తి శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బి.రత్నకుమార్ విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో లావేరు మండల తహసీల్దార్‌గా పనిచేసిన దిలీప్‌చక్రవర్తిని నియమించారు.

వంగర: తహసీల్దార్‌గా కె.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన డి.ఐజాక్ చీపురుపల్లి ఆర్‌డీవో కార్యాలయం ఏవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సుధాకర్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.